క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, హరిరమాదేవి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభం

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో కొత్తగా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చేతుల మీదుగా ఈ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఏడాది క్రితమే ఇక్కడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం ప్రారంభోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవం వాయిదా పడింది. హనుమకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లోని సగం భాగాన్ని విభజిస్తూ కొత్తగా హసన్‌పర్తి పేరిట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది.

కారుణ్య నియామకం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కుక్‌గా పనిచేస్తూ దామెర కుమారస్వామి గతేడాది జులైలో మరణించారు. మృతుడి కుమారుడు దామెర శశికాంత్‌ను కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో శశికాంత్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

ఉద్యోగం ఇవ్వండి

నయీంనగర్: ఇటీవల మరణించిన ఏసీటీఓ ఎండీ.ముస్తాక్ కుమారుడికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇవ్వాలని టీసీపీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసీటీఓ ఎండీ.ముజాహిద్ హుస్సేన్ కోరారు. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ నోడల్ జాయింట్ కమిషనర్ శశిధరచారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



వరంగల్ చౌరస్తా: వరంగల్ గిర్మాజీపేట 26వ డివిజన్‌లో మూడేళ్ల క్రితం ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులపై ఆత్మహత్య చేసుకున్న ఉప్పుల నవదీప్, స్రవంతి దంపతుల పిల్లల చదువుల కోసం వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మూడేళ్లుగా చేయూతనిస్తున్నట్లుగానే ఈ ఏడాది రూ.24 వేలను పిల్లల పెద్దనాన్న ఉప్పుల బాలుకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా కోశాధికారి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

శరీర దానానికి అంగీకారం



రామన్నపేట: నగరంలోని కుంటి భద్రయ్య దేవస్థానం పక్కన ఓఎస్ నగర్‌లో నివాసముంటున్న వికలాంగుడు యశ్వంత్ తన మరణానంతరం తన శరీరాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించాలని అంగీకారంతో ఇచ్చిన అంగీకార పత్రాన్ని యశ్వంత్ తల్లి వనజ శుక్రవారం తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మరణానంతరం పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం ద్వారా దాదాపు 20 నుంచి 25 మంది వైద్యులను తయారు చేయడానికి ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను, కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మిట్టపల్లి సమ్మయ్య, సురేష్, శివ పాల్గొన్నారు.

పీవీపై పాట ఆవిష్కరణ



నయీంనగర్: ఈ నెల 28న భారతరత్న, మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జయంతి సందర్భంగా పీవీపై సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్ రాసిన పాట సీడీని హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పాములపర్తి రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పాట తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉందని అన్నారు. తెలుగువారి గొప్పతనం చాటేలా పేరు సంపాదించిన పీవీ పాట ఉభయ రాష్ట్రాలతో పాటు దేశమంతా సోషల్ మీడియాలో మారుమోగేలా తెలుగు ప్రజలు షేర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ సుప్రీం శేఖర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మదన్‌మోహన్ రావు, పిన్నా శివకుమార్, పీవీ అభిమానులు, సాహితీ ప్రియులు, కవులు, కళాకారులు, సంగీత ప్రియులు, తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో రాజీవ్ గృహకల్ప



సీసీటీవీ పుటేజీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్, ఏసీపీ, సీఐ (ఫైల్)





రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

- బల్దియా నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో సీసీ కెమెరాలను అమర్చారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ గృహకల్ప సముదాయానికి ఆనుకుని ఉన్న ఇందిరమ్మ కాలనీలోని ఓ కిరాణం షాపులో ఇటీవల భారీ దొంగతనం జరిగింది. అలాగే, రాత్రివేళల్లో అసాంఘిక కలాపాలు జరుతున్నాయి. ఆకతాయిలు మద్యం తాగి నానా హంగామా చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ గృహకల్ప అభివృద్ధి కమిటీ వినతి మేరకు బల్దియా నుంచి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. గృహకల్పలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, అప్పటి మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్, స్థానిక కార్పొరేటర్ జలగం అనిత ప్రారంభించారు.

ర్యాగింగ్.. చట్టరీత్యా నేరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్షమాదేశ్ పాండే, అతిథులు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే

హన్మకొండ: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, పోష్ ఇంటర్నేషనల్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ ఎబ్యూస్, షీటీమ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి, షీటీమ్ సీఐ సుజాత, ఎస్సై మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: నర్సంపేట బాలికల మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ జేఎల్, పీజీటీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీసెస్ బాధ్యులు హుసేన్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ బయోసైన్స్ -1, జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్ -1 ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 81060 78890 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..

విద్యారణ్యపురి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2025వ సంవత్సరానికి ఉత్తమ జాతీయ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఆన్‌లైన్ ద్వారా కేంద్ర విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు కోరుతున్నారని ఆయన తెలిపారు. సంబంధిత రెండు ప్రతులను మండల విద్యాశాఖాధికారుల ద్వారా జూలై 15 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలో గత మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ పథకం కింద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3.34 కోట్లకు పైగా ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వైవీ.గణేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలో 9 ప్రైవేట్ పాఠశాలలో బెస్ట్ అవలెబుల్ పథకం ద్వారా డే స్కాలర్, రెసిడెన్షియల్‌లో 600 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా నేటికీ ఆ పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోలేదని వాపోయారు. ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులు, విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు మానసికంగా వేధిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు మాదాసి అబ్రహం, అనిల్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

డీఎండబ్ల్యూఓగా హైదర్ బాధ్యతల స్వీకరణ



న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి (డీఎండబ్ల్యూఓ)గా కేఏ గౌస్ హైదర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో హైదర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను డిప్యూటేషన్‌పై మైనార్టీ సంక్షేమ అధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన గౌస్ హైదర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామన్నపేట: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా జులై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో ఆటో అండ్ ట్రాలీ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంజీఎం ఆటో అడ్డా సమీపంలో సమ్మె కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె రోజు ఆటో కార్మికులందరూ ఆటోలు బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని అరూరి కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గున్నాల ప్రభాకర్, నాగపూరి వెంకటేశ్వర్లు, ఆటో డ్రైవర్లు ఎస్కే దస్తగిరి, ఎంఏ సలాం, ఎండీ మాషూఫ్, యాకూబ్ పాషా, గగర్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇన్‌చార్జ్‌గా ప్రవీణ్‌కుమార్

మడికొండ: బహుజన సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన వస్కుల ప్రవీణ్‌కుమార్‌ను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యూశాయంపేట అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ, గాయత్రి కాలనీల్లో రూ.90 లక్షల బల్దియా నిధులతో నిర్మించనున్న అంతర్గత రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణంతో పాటు నిరుపేదలకు సొంతింటి కల సాకారానికి ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, హౌజింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, వార్డ్ ఆఫీసర్ లోకనాథం, ఏఈ నవ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విద్యారణ్యపురి: జాబ్‌మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆర్డీఎస్‌డీయూ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 2022 – 2025 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రాంగణంలో అప్రెంటిషిప్ జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ చందర్, వరంగల్ ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ మాధవరావు, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ నవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు సంపత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

4న గొర్రెల పెంపకందారుల సంఘం మహాసభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: వచ్చే నెల 4న కాజీపేటలో నిర్వహించనున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ జిల్లా మూడో మహాసభకు యాదవులు పెద్ద సంఖ్యలో హాజరై సత్తా చాటాలని సంఘం జిల్లా కార్యదర్శి లింగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో మహాసభల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గొల్ల, కురుమలకు రూ.రెండు లక్షల నగదు బదిలీ వారి ఖాతాల్లో జమచేస్తామని చెప్పి రెండేళ్లయినా అమలు చేయడం లేదని అన్నారు. గొర్రెలు, మేకలకు సంవత్సరానికి మూడుసార్లు నట్టల నివారణ మందులు వేస్తామని విస్మరించారని అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో రమేష్, కుమార్, రవీందర్, భీమన్న, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల మెడికోలు సూచించారు. ఈ మేరకు హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో విద్యార్థులకు మెడికోలు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజ్‌కుమార్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మెడికోలు

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లకు ఘన సన్మానం



తిరుపతి రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన వి.తిరుపతి రెడ్డి, సి.ప్రభాకర్, వి.మోహన్ రావు, టి.మధుసూదన్‌ను తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 నాయకులు శుక్రవారం సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్లను టీఎస్ఈఈయూ – 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

తిరుపతి రెడ్డికి శుభాకాంక్షలు

టీజీ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వంటేరు తిరుపతి రెడ్డికి విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా తిరుపతి రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, ఉపాధ్యక్షులు శ్యామల రావు, షరీఫ్, టీజీఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు వేణుబాబు, కార్యదర్శి సుదర్శన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కేయూ పాలక మండలి సభ్యుల దిష్టిబొమ్మ దహనానికి యత్నం

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కాకతీయ యనివర్సిటీ భూమిని కేటాయిస్తూ ఇటీవల పాలక మండలి ఆమోదించింది. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేయూ పాలక మండలి సభ్యుల దిష్టిబొమ్మను పరిపాలన భవనం ఎదుట శుక్రవారం దహనానికి యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ కేయూ భూములను ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను యూనివర్సిటీ అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, వంశీ, కేశవ, అశోక్, రామ్, సూర్య, నరసింహ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే సీజ్

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న హెచ్చరించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అదాలత్ సెంటర్‌లో పలువురు వాహనదారులకు సీఐ శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. మారిన నూతన చట్టాలకు అనుగుణంగా అన్ని కాగితాలను వాహనదారులు తమ దగ్గర ఉంచుకోవాలని అన్నారు. నంబర్ ట్యాంపరింగ్ చేసి దొరికితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

కాజీపేటలో పీరీల ఏర్పాటు

కాజీపేట: త్యాగం, వీరత్వానికి ప్రతీకైన మొహర్రం సందర్భంగా కాజీపేట పట్టణంలో పీరీలను శుక్రవారం ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 10 రోజుల పాటు వరుసగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు పురవీధుల్లో ఊరేగింపులు నిర్వహించడం ఆనవాయితీ. ముతావలి అమ్మూబాయ్ ఆధ్వర్యంలో పతర్ గటి, ఇమామ్ ఖాసి, హసన్ హుస్సేన్, షేక్ అలీ అబ్బాస్ పీరీలను ఏర్పాటు చేశారు. పదోరోజు పీరీలను నిమజ్జనం చేస్తారు. జూలై 6న మొహర్రం వేడుకలు పట్టణంలో నిర్వహించనున్నట్లు అమ్మూబాయ్ తెలిపారు.

హెల్త్ కమిషనర్‌ను కలిసిన 108 ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు హనుమకొండ జిల్లాకు శుక్రవారం వచ్చిన హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీతను తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ బాలాజీ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్, మహిళా అధ్యక్షురాలు చైతన్య, ఈఎంటీ స్వాతి, దస్తగిరి, ఎస్కే స్వామి, తక్కల్ల నరేష్, రవి, భిక్షపతి, కుమార్, పైలట్ శ్రీధర్, కొండ తిరుపతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఖిలా వరంగల్: డివిజన్ పరిధిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, హై, లోఓల్టేజీ సమస్యలతో గృహోపకరణాల దగ్ధమవుతున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ కరీమాబాద్ సబ్ స్టేషన్‌లో ఏఈ సంపత్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో కరెంట్ సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూజారి విజయ్, వనకుమార్, చెట్టి మోహన్, చీర రమేష్, కొండిల్ల కనకయ్య, కొండిల్ల రవీందర్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమం చేశారు. సోమవారం మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, చైర్మన్ పల్లపు అర్జున్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులపై విచారణ

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్‌లోని అబ్బనికుంట, ఎల్‌వీఆర్ నగర్, యాకుబ్ పురా, దయానంద కాలనీల్లో కొత్తగా రేషన్‌కార్డు కోసం చేసుకున్న దరఖాస్తులపై శుక్రవారం విచారణ చేపట్టారు. మెప్మాకు చెందిన ఆర్‌పీలు దరఖాస్తు దారులకు సమాచారం అందించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే, వంద రోజుల కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఎల్‌వీఆర్ నగర్‌లో బల్దియా సిబ్బంది పారిశుద్ధ్య, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ ఫార్మసీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆధార్ ఆధారిత హాజరు వ్యవస్థను ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, తరుణ్, నవీన్, మాడిశెట్టి మహేష్, విజయ్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

గీసుకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని, తమకు రాలేదని ఎవరూ బాధపడొద్దని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శుక్రవారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ సర్కారుతోనే తీరుతుందన్నారు. తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు కొండేటి కొమురారెడ్డి, కటకం సురేందర్, కుమారస్వామి, గోదాసి చిన్న, ఎలగొండ ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ మహేందర్ మృతికి సంతాపం

నయీంనగర్: జర్నలిస్ట్ మహేందర్ మృతిపై టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (హెచ్ -143) హనుమకొండ జిల్లా కమిటీలు, టీడబ్ల్యూజేఎఫ్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపాయి.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కేయూ క్యాంపస్: జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు కుమ్మరి రాజన్నమాదిగ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఈఎఫ్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ బొక్క మొగిలి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాజన్న మాదిగ మాట్లాడారు. ఆవిర్భావ వేడుకల్లో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ ఆర్డీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మురళి మాదిగ, ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ, నాయకులు తోట శ్రీనివాస్, కిరణ్, రాములు, మహర్షి, వేణు, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు రైలుకింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చింతలపల్లి – వరంగల్ స్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బదురియా జిల్లా సయేస్తా నగర్‌కు చెందిన సాగర్ దాస్ (18) అదే గ్రామానికి చెందిన సుకుమార్ కలిసి ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో షాలిమార్ నుంచి సికింద్రాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో చింతలపల్లి – వరంగల్ స్టేషన్ మధ్యలో ప్రమాదవశాత్తు సాగర్ దాస్ జారిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బంధువులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు రాజు వివరించారు.

ఇందిరమ్మ కాలనీలో చైన్ స్నాచింగ్



కాజీపేట: కాజీపేట 49వ డివిజన్ దర్గా కాజీపేట శివారులోని ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం ఉదయం అల్వాల కాంతమ్మ వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును తెంపుకుని పరారయ్యాడు. ఎస్సై నవీకుమార్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట గ్రామానికి చెందిన కాంతమ్మ తన తమ్ముడు రమేష్ అనారోగ్యంతో ఉండటంతో పరామర్శించడానికి వచ్చారు. శుక్రవారం ఉదయం వాకింగ్ చేస్తున్న కాంతమ్మను మందలించి దృష్టి మరల్చిన ఓ యువకుడు.. ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కుని ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పలు కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.